# 'సర్వదా సర్వకాలేషు సర్వత్ర నేనే'

**ఫిల్మురికార్డింగు ప్లేటును చూచిన**
**ఒక్కరీతిగానె ఒనరియుండు**
**సౌండుబాక్సునందు సవరించి చూచిన**
**పాటలెన్నొతీర్లు పల్కుచుండు.**

ప్రేమస్వరూపులారా!

మీరు పాపులు కాదు. మీరు పుణ్యులు కాదు. మీరు సుఖ స్వరూపులు కాదు. మీరు దుఃఖస్వరూపులు కాదు. మీరు మంత్రస్వరూపులు కాదు. తీర్థస్వరూపులు కాదు. యంత్రస్వరూపులు కాదు. తంత్రస్వరూపులు కాదు. అందరూ సచ్చిదానంద స్వరూపులే! కనుక, మీరు నిరంతరము ఈ మంగళవాక్యము చింతిస్తూరావాలి. 'శివోహం, శివోహం, శివోహం'. 'నేనే శివుడు', 'నేనే శివుడు', 'నేనే శివుడు', ఈ సత్యమైన ఏకాత్మ భావమును ఏ మానవుడు తన హృదయమందు స్థిరపరచుకొనునో అట్టివాడే దైవానుగ్రహమునకు నోచుకోగలడు.

**'నేను' అనేది మొట్టమొదటి పదము**

కూటిపేద మొదలుకొని కోటీశ్వరునివరకు, అజ్ఞాని మొదలుకొని పరమహంసవరకు, బాలుడు మొదలుకొని వృద్ధునివరకు స్త్రీపురుషులయందు ఎవరికి వారు తనను పరిచయము చేసుకొనవలెనంటే 'నేను', 'నేను' అనే పదమును ఉపయోగపెడుతుంటారు. ఈ 'నేను' అనే పదమే సర్వత్రా వ్యాపించి ఉన్నది. ప్రతి మానవుడు 'నీ పేరేమి, నీవు ఎక్కడనుంచి వచ్చావు?' అంటే, 'నేను బెంగళూరునుంచి వచ్చాను' అని చెపుతాడు. 'నేను' అని మొదలు ఉపయోగపెట్టి తరువాత 'బెంగుళూరునుంచి వచ్చాను', అంటాడు. 'నీవెవరు' అని ప్రశ్నించినపుడు 'నేను రామయ్య కొడుకు సూరయ్యను' అంటాడు. ఏ జవాబు చెప్పినా 'నేను' అనే పదములేక ఏ జవాబు చెప్పలేరు. నీ పేరు ఏమి అని అడిగితే తాను ఎన్ని విధములుగానో చెబుతూ వస్తాడు.

srisathyasaivachanamrutam

నా పేరు 'భోపాల్', నా తండ్రి పేరు 'భూపాల్', నా తాత పేరు 'నేపాల్'. ఈ విధంగా హనుమంతుని తోకవలె పెంచుకుంటూ పోయే దానికంటె 'నేను ఎవరు?' అంటే 'నేను నేనే' ఎంత సులభంగా చెప్పవచ్చు. I am I. ఇది చక్కని సరైన అర్థమునిచ్చే పదము. మానవుడు పుట్టకముందే మొట్టమొదట 'నేను' పుట్టింది. తదుపరే వారు, వీరు అనేది వచ్చింది. వేదాంతము 'అహం బ్రహ్మాస్మి' అనింది. బ్రహ్మకంటె ముందుగా అహం పుట్టింది. అహం నేను బ్రహ్మ అంటున్నా కాబట్టి బ్రహ్మకంటె ముందుగా పుట్టినది ఈ 'నేను'. ఇంతటి శక్తివంతమైన 'నేను'ను సులభమైన మార్గములో చులకనైన మార్గములో మనము ఉపయోగ పెట్టుకుంటున్నాము. ఈ 'నేను' ను శృతి 'హృదయం' అనింది. హృదయమనగా హృత్+దయ=హృదయ అనగా compassion తో కూడిన దానిని 'నేను' అంటారు. 'నేను' అనేది కరుణతో కూడినది. 'నేను' అనేది దేహాన్ని పురస్కరించుకొని చెప్పటంకాదు, 'నేను' అనేది కరుణతో కూడినది. 'నేను, కరుణ, ఆత్మ, హృదయం, బ్రహ్మ' ఇవన్నీ పర్యాయపదములే; 'నేను' కు. 'నేను' మొట్టమొదటి పదము. ఇలాంటి మొదటి పదమైన దైవత్వమును, హృదయత్వమును, ఆత్మ తత్త్వమును ఈనాడు మరచిపోయి 'దేహమే నేను' అనే మార్గములో జీవిస్తున్నాడు మానవుడు. ఒక చిన్న ఉదాహరణము.

**'నేను' తత్త్వము మార్పు చెందనిది**

నీవు ఎప్పుడు వచ్చినావని ప్రశ్నించినప్పుడు 'నేను ఉదయం వచ్చాను', అని జవాబు యిస్తావు. నిజానికి, ఉదయం వచ్చినది ఏది? దేహము వచ్చింది. కాబట్టి 'దేహమే నేను' అనే భ్రాంతితో 'నేను ఉదయం వచ్చాను' అంటున్నావు. సరే! దేహమే నీవనుకొని నేను ఉదయం వచ్చాను చెప్పావు. మరు నిముషములోనే 'నా కడుపు చాలా బాధగా ఉంటున్నాది', అంటున్నావు. ఇంతకు ముందు దేహమే నేననుకొని 'ఉదయం వచ్చాను' అన్నావు. ఇప్పుడు 'నా కడుపు' అంటున్నావు. నీవు ఎవరు? 'ఇది నా చేయి. ఇది నా తల, నా పొట్ట', ఈ నేనెవరు? 'ఇది నా టవలు' అన్నప్పుడు ఈ టవలు వేరు, నేను వేరు. అదే రీతిగా 'నా చేయి' అంటే చేయి వేరు, నీవు వేరు. నా పొట్ట అంటే పొట్ట వేరు, నీవు వేరు. ఈ నీవు ఎవరు? ఈ విధముగా చక్కగా పరిశీలన చేస్తే ఒక సమయంలో దేహమే నేననుకొని నేను ఉదయం

sri sathyasai vahini

వచ్చానంటున్నావు. మరొక నిముషములో ఇది నా దేహము అంటున్నావు. అది నిజమా, ఇది నిజమా? నా దేహము అనేది కొద్ది కాలము మాత్రమే ఉండేది. నేను అనేది తరతరములనుండి వస్తున్నాది. ఇది మార్పు చెందనిది. ఇలాంటి నిత్యసత్యమైన 'నేను' తత్త్వాన్ని ఈనాడు మానవుడు విస్మరిస్తున్నాడు. కేవలం అనిత్యము, అశాశ్వతమైన దేహతత్త్వమే నేనని విశ్వసిస్తున్నాడు.

**కార్య, కారణ స్వరూపుడైన భగవంతుడు ద్రష్టగాను ఉన్నాడు, దృశ్యములోను ఉన్నాడు**

ఈ దేహము కేవలము ఒక ఉపాధి; తొడుగువంటిది. నేను Robe వేసుకున్నాను. ఇక్కడ Robe వేరు, నేను వేరు. అదే రీతిగా దేహము, జీవికి ఒక Robe మాదిరి ఉంటున్నాది. జీసస్ పోయే సమయంలో death is the dress of life అన్నాడు. ఇది ఒక dress, ఎప్పుడు విడుస్తామో! ఎప్పుడు తిరిగి యింకోదాన్ని తొడుక్కుంటామో! ఈ విధముగా వేదాంతమునందు అతి సూక్ష్మరహస్యము ప్రబోధిస్తూవచ్చింది. మానవత్వమునందు ప్రధానమైనది, 'నేను'. ఈ 'నేనులో' రెండు ఉంటున్నవి-నేను, ఇది. ఇది టంబ్లరు. ఈ టంబ్లరును ఏ రీతిగా నీవు చూడగలుగుతున్నావు? టంబ్లరు దృశ్యము, 'నేను' ద్రష్ట; ద్రష్ట ఉండటముచేత దృశ్యము చూడగలుగుతున్నావు. ద్రష్టలేక దృశ్యమేలేదు. 'నేను' ద్రష్ట; చూడబడే జగత్తంతా దృశ్యమే! కొంతమంది సందేహించవచ్చు. ఈ చూచేది నేత్రముకదా అనుకుంటున్నారు. నేత్రము కాదు చూసేది, నేత్రములోపల ఉన్నటువంటిది చూపిస్తున్నాది. బల్బులు వెలుగుతున్నాయి. బల్బులో వెలిగేది, బల్బులో ఉన్న కరెంటు. అదే వెలిగిస్తున్నాది. అదే రీతిగా కన్నుతో చూచేది. కన్నులుకూడా దృశ్యమే. ఆత్మయే ద్రష్ట. ఒక్కొక్కతూరి ఈ కన్నులుకూడా దృశ్యమైపోతాయి. చెవులుకూడా దృశ్యమవుతాయి. మనస్సుకూడా దృశ్యమైపోతుంది. ఆత్మ ద్రష్టగా మారుతుంది. దృశ్యమనే ప్రతి పదార్థము, చూడబడేది, వినబడేది, అనుభవించేది అంతా కేవలము దృశ్యస్వరూపమే! దీనినే దక్షిణామూర్తి స్తోత్రములో 'దృశ్యమంతా దర్పణములో చూసే స్వరూపమే' అని వర్ణింపబడినది. ఇక్కడ 'నేను', 'అది' అని రెండున్నాయి. 'అది' జగత్తు. 'నేను' కారణస్వరూపుడైన దైవము. ఈ దృశ్యమే కార్యస్వరూపము. కార్యకారణస్వరూపుడే భగవంతుడు. దృశ్యములోను ఉన్నాడు,

srisathyasaivachanamrutam

ద్రష్టగాను ఉన్నాడు. అదృశ్యముగాను ఉంటున్నాడు. అదృశ్యమంటే ఏమిటి? అ-దృశ్యము. దృశ్యమునకు గోచరము కానిది అదృశ్యము. ఈ జగత్తంతయు దృశ్యమే! ఈ 'నేను' ఇంద్రియములద్వారా అనుభవిస్తున్నాది. ఆనందిస్తున్నాది. కన్నులు చూడటంలేదు. కన్నులద్వారా ఆ దివ్యమైన 'నేను' చూస్తున్నాది. చిన్న ఉదాహరణము. నీవు మరణించిన తరువాత కన్నులుంటున్నాయి. కన్నులే ద్రష్టయై చూసేట్లయితే అవి స్వయంగా ఎందుకు చూడలేకుండా ఉంటున్నాయి. ఆ చూచే 'నేను' అక్కడ లేకుండాపోయింది. కనుక కన్నులు ఉంటున్నాయి, కానీ అందులో చూచే ద్రష్టలేడు. ప్రతి దానియందు దృశ్యమును, ద్రష్టద్వారానే అనుభవిస్తున్నాము. ఈ ద్రష్టయే దివ్యత్వమైన నేను.

**'నేను' అనేది సర్వకాలములందు, సర్వజీవులయందు ఉంటున్నది**

ఈ 'నేను' ఎక్కడనుంచి పుట్టింది? ఇది ఏ విధంగా ఆవిర్భవించింది? పిచ్చివాడా! ఈ 'నేను' ఆవిర్భవించేదికాదు, పుట్టేదికాదు. సర్వత్రా సర్వకాలములందు సర్వజీవులయందు ఉంటున్నాది. కనుక 'సర్వదా సర్వకాలేషు సర్వత్ర నేనే'. అదియే ద్రష్ట. ఈ ద్రష్ట పుట్టేదికాదు, పోయేదికాదు. రాకపోకలు లేనిది, యీ 'నేను'. దృశ్యము రాకపోకలు కలిగినది. దృశ్యమునందే అహము ఉంటున్నది. ఈ అహంకారమునకు, అహమునకు వ్యత్యాసము గుర్తించాలి. అహంకారము వచ్చిపోయే మేఘములు. అహం శాశ్వతమైన, రాకపోకలు లేని తత్త్వము. ఈ దృశ్యమును ద్రష్టగా భావిస్తున్నాము ఈనాడు. చూచినదంతా సత్యమని భావిస్తున్నాము. అనేకమంది 'ప్రత్యక్షప్రమాణమే మేము విశ్వసిస్తాము' అంటారు. ఎంత మూర్ఖత్వము! ఒక వ్యక్తి ఉన్నాడు. అతని ఎత్తు 6 అడుగులు. బరువు 80 కేజిలు. అతని ఎత్తు, బరువు చూసుకుంటున్నావు. అతని కలరు చామనచాయ. అతనికి బట్టతల. ఇవన్నీ కనిపించేవి చెబుతున్నావు. ఇవి చెప్పినంతమాత్రమున అతని తత్త్వమును తెలుసుకున్నవాడవు కాలేవు. ఎత్తు, బరువు చెబుతున్నావుగానీ అతనిలోపలనున్న గుణములెట్టివో నీకు కనబడుతున్నాయా? ఇవి కనిపించేవికావు. అంతవరకు పోనక్కరలేదు. 'నా మనసు' అని అంటున్నావు. నీ మనస్సును నీవు చూస్తున్నావా? లేదే! మరి ఎట్లా చెబుతున్నావు? నీవు నీకు కనుపిసున్నావా? లేదే! నీవు ఎట్లా చెబుతున్నావు? కనిపించని

దాన్ని ఎట్లా విశ్వసిస్తున్నావు? నీ కన్నులే నీకు కనిపించవు. అద్దము ఎదురుగా పెట్టుకున్నప్పుడే నీ కన్నులు నీవు చూడగలుగుతున్నావు. నీ కన్నులే నీకు కనిపించటంలేదు. లక్షలమైళ్ళ దూరములోనున్న అంతరిక్షమును చూస్తున్నావు. కానీ, నీ కన్నులు నీవు చూడలేవు. ఇవన్నీ దృశ్యములే! చూచేది దృశ్యమే! చూడబడేది దృశ్యమే. కానీ, ద్రష్ట సాక్షీభూతుడు. అతనే సాక్షి.

**రూపముగల మానవుడు రూపరహితమైన దివ్యత్వమును నిరూపిస్తున్నాడు**

ప్రతిదానియందు ప్రత్యక్షప్రమాణమని మూర్ఖముగా వాదిస్తుంటారు. కానీ యీ argument లో ఏమాత్రము commonsense లేదు. General knowledge zero. ఒక విషయములో 'నా ప్రేమ ఉన్నది' అంటావు. ఈ ప్రేమకు ఏమైనా రూపముందా? 'నేను దుః ఖముగా ఉంటున్నాను' అంటున్నావు. దుఃఖమునకు రూపముందా? నీవు ఎట్లా చెప్పగలవు? ఎట్లా నీవు నిరూపించగలవు? అయ్యా! నేను నిరూపించగలను. ఎట్లనగాష ప్రేమకు రూపములేదు. కానీ, ప్రేమించే తల్లికి రూపముంటున్నాది. పువ్వుకి రూపముంది కానీ పువ్వుయొక్క వాసనకు రూపములేదు. వాసనకు రూపములేదు కానీ పువ్వుకి రూపము ఉంటున్నాది. రూపమున్న పువ్వు రూపములేని వాసన అందిస్తున్నది. అదే విధముగా రూపమున్న మానవుడు రూపరహితమైన దివ్యత్వమును నిరూపిస్తున్నాడు. ప్రతి దానియందు దైవత్వము అంతర్భూతమై ఉంటున్నాది. ఈ సత్యమును కనుక్కొనటానికి సైంటిస్టులకు వేయి సంవత్సరములు పట్టింది.

**గొప్ప మేధాశక్తిగలవారికి విశ్వాసము ఉండదు**

ఈనాడు సైంటిస్టులు ఏమి చెబుతున్నారు? 'ఎక్కడ చూచినా ఈ అణుశక్తి ఉంటున్నాది' అని. యింతమాత్రం కనుక్కొనటానికి వేయి సంవత్సరములు ఎందుకు కావాలి? ఏనాడో త్రేతాయుగమునందు ప్రహ్లాదుడు కనుక్కున్నాడు, యీ సత్యము.

**ఇందుగలడందులేడని సందేహమువలదు**
**చక్రి సర్వోపగతుండు**
**ఎందెందు వెదకి చూచిన**

srisathyasaivachanamrutam

### అందందే కలదు.....

యీనాటి సైంటిస్టులు మేము ఎక్కడ చూచినా అణువుని చూస్తున్నామంటున్నారు. ఒక చిన్న ఉదాహరణము. నేను 30 సం॥ల ముందుగా Indian Institute of Science లో భగవంతం Director గా ఉంటున్నప్పుడు అతనింటిలో వున్నాను. ఆ యింటిలో ఒకనాడు ఒక International Conference జరిగింది. అందులో పాల్గొన్న కొందరు ప్రముఖ సైంటిష్టులకు స్వామిని సన్నిహితం గావించాలని భగవంతము వారిని భోజనానికి పిల్చాడు. సైన్సులో తెలివితేటలుకూడా చాలా తక్కువ. సైంటిష్టులు ఎంత తెలివిగలవారుగా ఉంటారో అంత విశ్వాసము లేకుండాకూడా ఉంటారు. ఎక్కడైనా మీరు వెతికిచూడండి. గొప్ప మేధాశక్తిగల వానికి ఏమీ విశ్వాసము ఉండదు. తనను తానే నమ్మలేడు. ఎప్పుడు చూచినా lab లో పరిశోధనలో ఉంటాడు. భోజనం చేస్తున్నాం. నేను చెప్పాను, 'మీరు సైంటిస్టులు అనుకుంటున్నారు. ఏమి తెలుసుకున్నారు?' అని అడిగాను. 'సూర్యచంద్రాదుల తత్త్వము మీరు ఏమైనా గుర్తించారా? సూర్యుడు, చంద్రుడు భూమి ఒకే పదార్థమే కదా!' అని అడిగాను. అన్నీ తెలుసుకున్నాము అనుకున్న ఒక సైంటిష్టు ఊరుకోకుండా 'సూర్యునికిప్పుడు మధ్యవయస్సు' అన్నాడు. మరొకాయన 'మంచి యువకుడు సూర్యుడు', అన్నాడు. నేను మళ్లీ 'ఎంత వయస్సు' అడిగాను. Millions of years అన్నాడు. వాళ్ళకు బుద్ధిలేదు. ఒకటి పెట్టి సున్నాలు పెడుతూపోతే మిలియన్సు అయిపోతుంది. దీనినే భారతీయులు 'అనాది' అన్నారు. ఎంత సులభము! అది చెబితే వారికి అవమానము. Millions of years అంటే వాడు సైంటిస్టు. వారికి నంబరు కావాలి. ఈ విధమైన అల్ప తృప్తితో పోతుంటారు. మన భారతీయుల వేదాంతతత్త్వము అనాదికాలమునుండి ప్రతి విషయమును సూటిగా హృదయమునకు హత్తుకునేటట్లుగా ప్రబోధిస్తూవచ్చింది.

### మేటరు, ఎనర్జీ రెండూ వేరు కాదు, ఒక్కటే

ఈనాటి సైంటిస్టులు matter and energy అంటారు. ఐన్‌స్టీన్‌కూడా matter and energy అన్నాడు. కానీ నా ఉద్దేశ్యము matter, energy రెండూ వేరు వేరుకాదు. Matter is energy; energy is matter రెండూ ఒక్కటే. Matter లేక energy మనకు కనిపించదు. Energy లేక

sri sathyasaivachanamrutam

matter మనకు తెలిసేది లేదు; రెండూ చేరి ఒక్కటే! ఒక చెట్టు మొలవాలంటే విత్తనము కావాలి. ఆ విత్తనముకి రెండు బద్దలుంటాయి. రెండు బద్దలు చేరినప్పుడే అది మొక్కగా అవుతుంది. ఒకే బద్ద వేస్తే అది మొలవదు. ఒక బద్ద negative ఒక బద్ద positive. ఒక బద్ద శక్తి energy; రెండవది matter. Matter, energy రెండూ చేరినప్పుడే పునర్జన్మము వస్తుంది. మనకు తెలియనిది నమ్మకుండా ఉండకూడదని ఏమాత్రము చెప్పకూడదు.

**కనిపించనిదే తినిపించును**
**నీ కర్మలఫలమును మర్మము జీవా**
**తైతై తైతై తైబొమ్మా!**
**దీని తమాష చూడర తోలుబొమ్మ!**

**అందము ప్రాయము ఇంద్రియశక్తియు**
**ఉందని నిక్కకురోరన్నా**
**ముందున్నదిరా తొందరలోనే**
**ముసలితనమ్మను ముసళ్ళ పండుగ ॥తై తై॥**

**మసలలేవు కనుమసకలు మోమున**
**ముడతలు పడె తల నెరిసెనుగా**
**ముసలి కోతియని పసివారలు నిన్**
**ముసిముసి నవ్వగ కసరే బొమ్మా ॥తై తై॥**

యిదా మనం చూస్తుండేది? శరీరము వృద్ధాప్యము పొందవచ్చు. Child, boy, man, grandfather ఒక్కడే! You are a boy. పది సంవత్సరములముందు child, 20 yrs కు man, 50 yrs grandfather. ఈ నాలుగు మీరే. Time difference గా వస్తున్నది. మనలో ఉండిన తత్త్వము చక్కగా గుర్తించుటకు ప్రయత్నము చేయుటలో ప్రత్యక్షప్రమాణమని అనకూడదు. ఒక చెట్టు ఉంటున్నాది. చాలా పచ్చగా కనిపిస్తున్నాది. బాగా అభివృద్ధి అవుతున్నాది. శాఖలు, శాఖలు పెంపొందిపోతున్నాయి. దాని చల్లని ఛాయ ఎంతనో హాయినిస్తున్నాది. ఆహా చెట్టు ఎంత బాగా నీడ యిచ్చింది అని



srisathyasaivachanamrutam

కనిపించే చెట్టును నీవు చూస్తున్నావు. కనిపించని వేర్లు ఈ చెట్టుకు ఆధారంగా ఉంటున్నాయి. నీవు వేర్లకు నీరు పోసినప్పుడు చెట్టు సమృద్ధిగా పెరుగుతుంది. ఈ భవనమును చూస్తున్నారు. పిల్లర్సు ఎంత బాగుంటున్నాయి. హాలు ఎంత బావుంటున్నాది. పునాది చూడు. మొట్టమొదట. పునాది లేక యీ పిల్లర్సు ఎట్లా ఉంటాయి? వేర్లు లేక వృక్షము ఎట్లా ఉంటున్నాది? అదే విధముగా బాహ్యము ఉండాలంటే భావము అనే దైవత్వము ఉండాలి. ఆ వేర్లకు నీరు పోసినప్పుడే చెట్టు అభివృద్ధికి వస్తుంది. ఈ వృక్షములోపల పూలు, కాయలు ఉంటున్నాయని పూలకు, కాయలకు నీరు పోస్తుంటే ఉండేవి రాలిపోతాయి. కాదు కాదు, కనిపించని వేర్లకు నీరు పోయాలి.

**వేదము సమత్వమును, ఏకత్వమును బోధించింది**

విద్యార్థులారా! ప్రతిదానికి ద్రష్ట కనిపించకుండా ఉంటున్నాది. అయితే ఏనాడు మీ భక్తి, ప్రపత్తులు అభివృద్ధిగాంచునో అప్పుడు అప్రత్యక్షంగా ఉన్నదికూడా ప్రత్యక్షమవుతుంది. త్యాగరాజు చెప్పాడు. 'నేనెందు వెదుకుదురా రామా! నేనెందు వెదుకుదురా! ఎక్కడ నేను వెతికేది? ఎక్కడున్నావని వెతికేది?' అనేటప్పటికి ఇందుకలడందులేడని సందేహము వలదు. కావేరి నదిలోనికి పోయి సంధ్య వార్చటానికి నీరు తీసుకునేటప్పటికి దోసిలలో రాములు దర్శనమిచ్చాడు! అప్పుడు ఆనందించాడు త్యాగరాజు. 'ఎంతవేడుకొందు రాఘవా (ఎంత వేడుకోవాలి) రామ నన్ను బ్రోవరా, రామా ప్రేమతో, లోకాభిరామా నన్ను బ్రోవరా'. ఎన్ని విధాలుగానో ప్రార్థించాడు. ఆ ప్రార్థనలో ఉంటున్నాది, జీవితమంతా. ఆ ప్రార్థన కేవలం పెదవులతో రావటంకాదు. హృదయముతో రావాలి. ఏ మానవుడు ప్రేమ హృదయమును అభివృద్ధి చేసికొనునో అక్కడ భగవంతుడు ప్రత్యక్షమవుతుంటాడు. ఒక చిన్న విషయము. మీకు తెలిసిన విషయము. కొంతమంది my dear sisters and brothers అంటారు. నా ఉద్దేశ్యము my ఉపయోగపెట్టవద్దు dear ఉపయోగపెట్టవద్దు, sisters and brothers చెప్పు. హాయిగా ఉంటుంది. ఇప్పుడు ప్రాపంచిక సంబంధమైన దాంట్లో my dear sister అంటే చాలా పెడమార్గము పడుతుంది. My dear sister అనకూడదు చాలా తప్పు, sisters and brothers అనండి, my sisters and brothers అనండి. గౌరవనీయంగా ఉంటుంది. ఇంతేకాదు, కొంతమంది పెద్దలుకూడా sai devotees, sai family అంటారు. చాలా తప్పు, అందరు ఒక family యే! 'సాయి' అని ఎందుకు



sri sathyasai vachanamrutam

ఉపయోగపెట్టాలి? మీరు సాయి అంటే యింకో రామభక్తుడు ఉంటాడు. కృష్ణభక్తుడు ఉంటాడు. అసలు పేర్లే ఉపయోగపెట్టకండి. మీకు అంత యిష్టముగా ఉంటే నమస్కారమను. కింద ఏదైనా పడిపోతే తీసి యిస్తే thanks sir అంటారు. ఎందుకీ పరదేశముది? దీనికి బదులు నమస్తే అంటే ఎంత బాగుంటుంది! ఇలాంటి పవిత్రమైన మన భారతీయ సంస్కృతియందు ఒక్కొక్క పదమునకు విలువ ఎంతయో యిచ్చి ఉంది. మనది సంస్కృతి. ఈ సంస్కృతి తత్వము మనము ఏనాడు మరువకూడదు. అది శాశ్వతమైన వేదసంస్కృతి. ఎప్పటికి మారనిది. నిత్యసత్యమైనది. ఎన్ని యుగములు మారినా, ఎన్ని జగములు కదలినా సంస్కృతి ఎప్పటికి నిలిచి ఉంటుంది. హృదయములో భగవంతుని ఉంచుకొని ప్రేమపూర్వకంగా స్మరిస్తూరండి. అప్పుడు జగత్తులో ఏ విధమైన కలహములు, కల్లోలములు ఉండవు. ఈ జగడములు 'నేను, నీవు' అనే భేదములవల్ల వస్తున్నాయి. అందరూ ఒక్కటే! All are one my dear son, be alike to every one అన్నాడు జీసస్. అందరిని మనం like చేయాలి. ఇది మన భారతీయ సంస్కృతి. ఏమి చెప్పారు వేదమందు?

**సహనావవతు సహనౌభునక్తు సహవీర్యం కరవావవహై**
**తేజస్వినావధీతమస్తు మా విద్విషావహై**

**కలసిమెలసి తిరుగుదాం కలసిమెలసి పెరుగుదాం**
**కలసిమెలసి కలిమిచెలిమి బలము గుణము పెంచుదాం**
**కలసిమెలసి తెలుసుకొన్న తెలివిని పోషించుదాం**
**కలసిమెలసి కలిమితోడ చెలిమిగ జీవించుదాం**

మొట్టమొదట వేదము సమత్వమును, ఏకత్వమును బోధించింది.

విద్యార్థులారా! ఎంతకాలమైనా మనం ఈ సంకుచితమైన భావములతో కాకుండా విశాలమైన భావములతో జీవిస్తూ యావత్ప్రపంచమునకు ఏకత్వమైన దివ్యత్వమును చాటటానికి కంకణం కట్టుకోవాలి.

**(తేదీ 25-08-1996న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasaivachanamrutam